# ఐఐటీ, ఎన్ఐటీ కలలు ఫలించలేదా?

**ఐఐటీ-జేఈఈ, ఏఐఈఈఈలు రాసి, మంచి ర్యాంకు సాధించలేకపోయిన విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉన్నారు. నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య అభ్యసించాలనే అభిలాషకు వీరు నీళ్ళొదులుకోవలసిందేనా? ఇలాంటివారు ప్రత్యామ్నాయంగా ఏ మార్గాలు ఆలోచించవచ్చు?**



**ధాగం కృష్ణమూర్తి**
**కృష్ణమూర్తి ఐఐటీ అకాడమీ**

ఐఐటీ-జేఈఈతో సహా దేశవ్యాప్తంగా నిర్వహించిన దాదాపు అన్ని ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షల ఫలితాలూ వెలువడ్డాయి, మన ఎంసెట్ ఫలితాలు తప్ప! గత ఏడాది మాదిరిగా ఈసారి ఐఐటీలు ఎక్స్‌టెండెడ్ మెరిట్ జాబితా (EML) ను ప్రకటించలేదు. దానివల్ల ఐఐటీ-జేఈఈలో ర్యాంకు సాధించని విద్యార్థులకు కనీసం తాము ఏ స్థానంలో ఉన్నారో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. అంతే కాకుండా EML ప్రాతిపదికన ప్రవేశం కల్పించే IISER లాంటి కొన్ని విద్యాసంస్థల్లో చేరే అవకాశం లేకుండా పోయింది.

ఐఐటీ-జేఈఈ, ఏఐఈఈఈల్లో మంచి ర్యాంకు రాని విద్యార్థులు విద్యాసంస్థ బ్రాండ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలా, తీసుకునే బ్రాంచికి ప్రాధాన్యం ఇవ్వాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఐఐటీలకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి ఉందన్న విషయంలో సందేహం లేదు. కానీ కొన్ని ఎన్.ఐ.టి.లకూ, ఐఐఐటీ, బిట్స్ (పిలానీ) లాంటి విద్యాసంస్థలకూ, డీమ్డ్ విశ్వవిద్యాలయాలకూ కూడా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది.

అందుకని ఐఐటీ-జేఈఈలో మంచి ర్యాంకులు రాని విద్యార్థులు కేవలం ఐఐటీ బ్రాండ్ కోసం తమకు ఆసక్తి లేని కోర్సుల్లోనో, అంతగా ప్రాధాన్యం లేని బ్రాంచిలోనో చేరటం సరైంది కాదు. వీరు ఎన్ఐటీ, ఐఐఐటీ, బిట్స్ లాంటి సంస్థల్లో తమకు నచ్చిన బ్రాంచిలో ప్రవేశం లభిస్తే తప్పకుండా చేరవచ్చు.

## అన్నిచోట్లా రాజీ

ఆసక్తి లేని బ్రాంచిని ఎన్నుకోవడం వల్ల విద్యార్థి చదువు, ఉద్యోగం విషయాల్లో ప్రతిచోటా రాజీ పడాల్సివుంటుంది. ఎన్ఐటీ, బిట్స్‌ల బ్రాండ్ విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. అంటే ఎన్ఐటీ, బిట్స్‌లలో అనుకున్న బ్రాంచిలో ప్రవేశం దొరకని విద్యార్థులు జేఎన్‌టీయూ, ఓయూ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆ కోర్సుల్లో ప్రవేశం లభిస్తే చేరటం వల్ల పెద్దగా నష్టపోయేదేమీ ఉండదు. బిట్స్ బ్రాండ్ చూసి, తమకు ఆసక్తి లేని బీఫార్మసీ, ఎంఎస్సీ బయాలజీ లాంటి కోర్సుల్లో చేరి, తర్వాత పశ్చాత్తాపపడ్డ విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు.

‘ఏ విద్యాసంస్థ నుంచి డిగ్రీ పొందాం’ అనేదానికంటే ఎంత క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (CGPA) సాధించామనే విషయానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. అందుకనే విద్యార్థులు 75 శాతం ప్రాధాన్యం కోర్సుకూ, 25 శాతం ప్రాధాన్యం విద్యాసంస్థ బ్రాండ్‌కూ ఇవ్వడం మంచిది. బ్రాండ్ ఇమేజ్ మోజులో పడి కొంత మంది విద్యార్థులు మన రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలను చిన్నచూపు చూస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

## ప్రత్యామ్నాయాలు

ఐఐటీ-జేఈఈ, ఏఐఈఈఈల్లో మంచి ర్యాంకులు రాని విద్యార్థులు, బిట్‌శాట్‌లో మంచి స్కోరు సాధించలేనివారూ దిగులుపడవలసిన అవసరం లేదు. ఈ పరీక్షలతో సంబంధం లేకుండా ప్రవేశం కల్పించి, నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను అందించే విద్యాసంస్థలు కొన్ని దేశవ్యాప్తంగా ఉన్నాయి. వీటిలో ఎక్కువ తమిళనాడు రాష్ట్రంలో ఉన్నాయి. విఐటీ, ఎస్ఆర్ఎం, శస్త్ర, సత్యభామ లాంటి డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు మంచి గుర్తింపు ఉంది.

**ఐఐటీ-జేఈఈలో మంచి ర్యాంకులు రాని విద్యార్థులు కేవలం ఐఐటీ బ్రాండ్ కోసం తమకు ఆసక్తి లేని కోర్సుల్లోనో, అంతగా ప్రాధాన్యం లేని బ్రాంచిలోనో చేరటం సరైంది కాదు.**

అలాగే మన రాష్ట్రంలోని గీతమ్, విజ్ఞాన్ లాంటి డీమ్డ్ విశ్వవిద్యాలయాలను కూడా విద్యార్థులు ఎంచుకుంటున్నారు. నాణ్యమైన విద్య అందించే ఇంజినీరింగ్ కళాశాలలు మన రాష్ట్రంలోనూ చాలా ఉన్నాయనీ, అలాంటిచోట చదివినవారికి పై చదువులకు వెళ్ళే అవకాశాలూ, ఉద్యోగావకాశాలూ బాగానే ఉంటాయనీ మరిచిపోకూడదు. సంస్థ వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుని, సందేహాలు నివృత్తి చేసుకున్నాకే విద్యాసంస్థల్లో చేరాలి.

## డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం

అదనంగా ఒక డిగ్రీ వస్తుంది కదా అని చాలామంది విద్యార్థులు డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంను ఎంచుకుంటుంటారు. ఆ డిగ్రీతో భవిష్యత్తులో తమకు ప్రయోజనం ఉంటుందా లేదా అనే విషయం గురించి ఆలోచించరు. ఉదాహరణకు... ఎలక్ట్రానిక్స్‌లో బీటెక్ చేసిన విద్యార్థికి అదనంగా ఎంఎస్సీ బయాలజీ డిగ్రీ రావడం వల్ల ఒరిగేదేమీ ఉండదు.

ఇంజినీరింగ్ తర్వాత విదేశాల్లో రెండేళ్ళు ఎం.ఎస్. చేయదల్చుకున్న విద్యార్థులకు డ్యూయల్ డిగ్రీలో చేరటం వల్ల ఒక సంవత్సరం వృథా అవడం తప్ప లాభమేమీ ఉండదు. కానీ తొందరగా చదువు ముగించుకుని ఉద్యోగంలో స్థిరపడాలనుకునే విద్యార్థికి డ్యూయల్ డిగ్రీ చేయడం వల్ల ఒక సంవత్సరం కలిసొస్తుంది.

అందుకనే కోర్సు, బ్రాంచి, విద్యాసంస్థలను ఎంచుకోవడంలో స్నేహితులను అనుకరించకుండా తమ ఆసక్తి, సామర్థ్యం, లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు నిర్ణయం తీసుకోవాలి. ఈ దశలో తీసుకునే నిర్ణయం కీలకమైందనీ, అది జీవితంలోని మిగతా భాగాన్ని ప్రభావితం చేస్తుందనీ విద్యార్థులూ, తల్లిదండ్రులూ గమనించాలి.